సాక్షి
తిరుపతి
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



పర్యాటక రంగానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. - 8లో



వార్తలు రాస్తే నరుకుతాం!

తమ భూ ఆక్రమణలకు సంబంధించిన వార్తలు రాస్తే నరుకుతామంటూ కూటమి నేతలు పేట్రేగుతున్నారు. - 8లో



విద్యుత్ షాక్‌తో చేపలు మృతి

కొందరు యువకులు అక్రమంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని కైవల్య నదిలో వేస్తున్నారు. దీంతో చేపలు మృతిచెందుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

వీసీ పోస్టులకు హోరాహోరీ

ఆన్‌లైన్ దరఖాస్తులకు రేపే ఆఖరు

తిరుపతి సిటీ: జిల్లాలోని ద్రావిడ, ఎస్వీయూ, పద్మావతి మహిళా వర్సిటీలకు సంబంధించి వీసీ పోస్టుల నియామకాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఆదివారంతో ముగియనుంది. కాగా ఈ మూడు వర్సిటీలకు సంబంధించి ఆశావహులు పదుల సంఖ్యలో పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు కుప్పం ద్రావిడ వర్సిటీ వీసీ పోస్టుకు 9 మంది దరఖాస్తు చేసుకోగా, పద్మావతి మహిళా వర్సిటీకి ఏకంగా 12 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. అలాగే ఎస్వీయూ వీసీ పోస్టుకు మాత్రం ఇప్పటి వరకు సుమారు 15మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం . వర్సిటీల చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున వీసీ పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తిన సంఘటలను లేవని పరిశీలికులు ఆశ్చర్యపోతున్నారు. రసవత్తర పోటీలో ఎవరికి పలుకుబడి, సత్తా ఉంటే వారికే పోస్టులు దక్కుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జాబ్ మేళాలో 66 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులతో జాబ్‌మేళా నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్డీఏ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 104 మంది హాజరయ్యారు. వివిధ రంగాలకు చెందిన ఐదు బహుళ జాతీయ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు వివిధ స్థాయిల్లో ఇంటర్వ్యూ ప్రక్రియ నిర్వహించి 66 మందిని ఆయా సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ గోపీకృష్ణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆర్.లోకనాథం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి, హెచ్‌ఓడీ ఎస్వీ.గౌరీశంకర్, ఆయా సంస్థల ప్రతినిధుల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : రాష్ట్ర సమగ్ర శిక్షా సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయా(కేజీబీవీ)ల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ద్వారా ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. పీజీటీ-3, పార్ట్ టైం టీచర్-2 పోస్టులకు ఏడాది కాల పరిమితికి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 'ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్లో పొందుపరిచిన వివరాలతో ఈ నెల 28వ తేదీ నుంచి అక్టోబర్ 10వ తేదీలోపు రూ.250 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులను నేరుగా స్వీకరించరని ఆయన పేర్కొన్నారు.

వర్సిటీ ర్యాంక్ మెరుగే లక్ష్యం



సమావేశంలో చర్చిస్తున్న వీసీ, ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ సభ్యులు

తిరుపతి సిటీ: ఏపీ ఉన్నత విద్యామండలి నిపుణుల కమిటీ శుక్రవారం మహిళా వర్సిటీని సందర్శించింది. వీసీ వీ.ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధికారులతో సమావేశమైంది. ఈ సదర్భంగా జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్, వర్సిటీ ర్యాంకింగ్‌ను మెరుగుపరచుకోవడానికి పలు సూచనలు చేసింది. వర్సిటీ బలం, బలహీనతలు, లోపాల గుర్తించి సరిచేసుకోవడం వంటి విషయాలపై కమిటీ చర్చించింది. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఫజుల్ రెహమాన్, కోయంబత్తూరు భారతీయార్ వర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్ ఓ.సంగీత, వారణాసిలోని బనారస్ హిందూ వర్సిటీ ఎన్ఐఆర్ఎఫ్ కో–ఆర్డినేటర్ భాస్కర్ భట్టాచార్య ఉన్నారు. ఏఐఆర్ఎఫ్ డైరెక్టర్ పీ.వెంకటకృష్ణ, ఐక్యూఏసీ డైరెక్టర్ టీ.త్రిపురసుందరి, కో–డైరెక్టర్ ఎం.ఉష సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,328 మంది స్వామివారిని దర్శించుకోగా 22,083 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సనాతన ధర్మాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అరాచక పర్వానికి తెరదీస్తోంది. కల్తీ లడ్డూ వివాద నేపథ్యంలో తిరుమలేశుని దర్శనానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వస్తే తమ ఆరోపణలన్నీ కొట్టుకుపోతాయని భయపడిపోయింది. అందుకే ఆయన పర్యటన ఖరారు కాగానే గాబరాపడిపోయింది. డిక్లరేషన్ పేరుతో అడ్డంకులు సృష్టించేందుకు తమ అనుయాయులను పురమాయించింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలకు నోటీసులిచ్చి, గృహనిర్బంధం చేయించి పైశాచిక ఆనందం పొందింది. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ అధినేత పర్యటన రద్దుకావడంతో ఊపిరి పీల్చుకుంది. దీనిపై చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రజానీకం రగిలిపోతోంది. నిరంకుశ పాలన ఎక్కువ కాలం సాగదని శాపనార్థాలు పెడుతోంది.



రేణిగుంట విమానాశ్రయంలో మోహరించిన పోలీసు బలగాలు

నిరంకుశం.. నిర్బంధం!

- వైఎస్ జగన్‌ను అడ్డుకునేందుకు కూటమి నేతల కుట్రలు, కుతంత్రాలు
- తిరుపతికి రాకూడదంటూ ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు
- అర్ధరాత్రి నివాసాలకు వెళ్లి నోటీసులు అందజేత
- తిరుపతిలో భయానక వాతావరణం సృష్టించిన కూటమి ప్రభుత్వం
- తనిఖీల పేరుతో స్థానికులు, భక్తులను ఇబ్బంది పెడుతున్న వైనం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనను సైతం రాజకీయంగా వాడుకునేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అన్నీ ఇన్నీ కావు. పోలీసులను రంగంలోకి దింపి ఆధ్యాత్మిక నగరంలో ఆంక్షల పేరుతో అరాచకాలకు పాల్పడుతోంది. అధికారాన్ని వినియోగించుకుని అడ్డగోలు ఆంక్షలతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడే నెయ్యిలో కల్తీ జరిగిందని.. జరగని తప్పిదంపై సీఎం చంద్రబాబు రాద్ధాంతం చేయడం తెలిసిందే. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం, ఆ పార్టీల నేతలు వ్యవహరిస్తున్న నేపథ్యంలో వైఎస్ జగన్ శనివారం శ్రీవారిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. చంద్రబాబు చేసిన పాపానికి పరిహారంగా ప్రక్షాళన పూజలు చేయాలని మరోవైపు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా వైఎస్ జగన్ శుక్రవారం రాత్రికి తిరుమల చేరుకోవాల్సి ఉంది. శనివారం ఉదయం స్వామి వారిని దర్శించుకుని, అదే రోజు మధ్యాహ్నం తిరుగు పయనమయ్యేలా పర్యటన ఖరారైంది. దీంతో మునుపెన్నడూ లేని విధంగా రేణిగుంట, తిరుపతి, తిరుమలలో ప్రభుత్వ పెద్దలు భారీగా పోలీసులను మోహరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా కఠిన ఆంక్షలు విధించారు. తనిఖీల పేరుతో స్థానికులు, భక్తులను ఇబ్బంది పెడుతున్నారు.

మహా 'కుట్ర'!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యంగా కూటమి నేతలు మహా కుట్రలకు పథకం రచించారు. కాషాయ వేషధారణలో ఉన్న డూప్లికేట్ స్వామిజీల ద్వారా కాన్వాయ్‌ని అడ్డుకోవడం, ఆపై రాళ్లు రువ్వడం, ఈ పరిణామాలన్నింటినీ సోషల్ మీడియా ద్వారా ట్రోల్ చేయడం లాంటి వాటికి ప్రణాళిక రచించారు. 'ముఖ్య' నేతల ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం తిరుపతి నగరంలోని ఓ హోటల్‌లో కూటమి నేతలంతా సమావేశమై చర్చించారు.

అర్ధరాత్రి వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు

వైఎస్ జగన్ తిరుమల పర్యటనను అడ్డుకునేందుకు జిల్లాలో పోలీస్ యాక్ట్ 30ని తెరపైకి తీసుకొచ్చారు. గురువారం వరకు లేని యాక్ట్ సాయంత్రానికి అమల్లోకి వచ్చింది. అయితే ఆ యాక్ట్ బుధవారం నుంచే అమలులో ఉన్నట్లు ప్రభుత్వం వెనుకటి తేదీతో ప్రకటించి, అధికార అరాచకాన్ని చాటుకుంది. వైఎస్ జగన్ వస్తున్నారంటే జనం తండోప తండాలుగా వస్తారని గ్రహించి.. కూటమి నేతలు పోలీసుల ద్వారా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులను భయభ్రాంతులకు గురిచేసే ప్రక్రియకు పదును పెట్టారు. ముఖ్య నేతల నుంచి ఆదేశాలు అందటంతో పోలీసులు హడావుడిగా నోటీసులు సిద్ధం చేశారు. గురువారం అర్ధరాత్రి దాటాక రాయలసీమ జిల్లాల్లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తల నివాసాల వద్దకు చేరుకున్నారు. ఘాడ నిద్రలో ఉన్న సమయంలో తలుపులు తట్టి లేపారు. ఆ సమయంలో పోలీసులు తలుపు తట్టి లేపడంతో ఏం జరిగిందోనని వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నోటీసులు చేతికిచ్చి వారి వద్ద సంతకం తీసుకుని వెనుదిరిగారు. 'ఎందుకు నోటీసులు ఇస్తున్నారు? పగలు వచ్చి ఇవ్వవచ్చు కదా?' అని అడిగినా పోలీసులు వినిపించుకోలేదు. తీసుకున్న వారికి చేతికి ఇచ్చారు. తీసుకోని వారి నివాసానికి నోటీసులు అంటించారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున అక్టోబర్ 24 వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలకు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. వారు ఇళ్లల్లోంచి బయటకు రాకుండా హౌస్ అరెస్ట్ చేశారు. మరో వైపు వైఎస్ జగన్‌ను అడ్డుకోవడానికి కూటమి నేతలు స్థానికేతరులను రప్పించారు. రేణిగుంట నుంచి తిరుమల మార్గంలో వైఎస్ జగన్‌ను అడ్డుకునేలా పథకం వేశారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ పర్యటన వాయిదా పడింది.







నోటీసులందుకుంటున్న ఎస్‌కే ఇమామ్ సాహెబ్, ఇమ్రాన్ బాషా, న్యాయవాది ఐసీఎస్ రెడ్డి, చిన్నముని, మధుబాల




వరదయ్యపాళెం: నోటీసు అందుకుంటున్న తిలక్‌బాబు, పెళ్లకూరు : నోటీసు అందుకుంటున్న మధుసూదన్‌రెడ్డి

పాప ప్రక్షాళన కోసం..

- నేడు జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తిరుపతి రూరల్: జరగని తప్పు జరిగినట్లు చెప్పడమే కాకుండా, వెనక్కి పంపిన నెయ్యిని శ్రీవారి లడ్డూల తయారీలో వాడినట్లు అసత్య ఆరోపణలతో సీఎం చంద్రబాబు చేసిన మహాపాపం రాష్ట్ర ప్రజలకు తగలకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులు నేడు జిల్లా వ్యాప్తంగా పాప ప్రక్షాళన పూజలు చేయనున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల ఆధ్వర్యంలో శనివారం ఉదయం పార్టీ నేతలు, కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చంద్రబాబు దేవుడిని సైతం రోడ్డుపైకి లాగుతున్నారని ఇప్పటికే దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. హిందూత్వ వాదులు సైతం చంద్రబాబు తీరుపై మండిపడుతున్నారు. నాణ్యత పరీక్షల్లో ఫెయిల్ అయిన నెయ్యి ట్యాంకర్లను వాడలేదని, తిప్పి పంపినట్లు టీటీడీ ఈవో ప్రకటన చేసిన తర్వాత కూడా, కల్తీ నెయ్యితో స్వామి వారి లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిపెట్టారని చంద్రబాబు చేసిన అసత్య ఆరోపణలు రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే అని సామాన్య భక్తులు సైతం ఛీదరించుకుంటున్నారు. తన ఇంటి దైవం వేంకటేశ్వరస్వామి అని చెప్పుకునే చంద్రబాబు రాజకీయంగా జగన్‌ను దొంగదెబ్బ తియాలనే ఇలా దేవుడి పేరుతో పరాచకాలు ఆడుతున్నారని, ఈ స్వార్థ రాజకీయ క్రీడలో జరిగిన మహాపాపం ఎక్కడ తమకు కూడా తగులుతుందో అని రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శనివారం ఉదయం గ్రామ గ్రామాన ఆలయాల్లో చంద్రబాబు చేసిన మహాపాపంపై పాప ప్రక్షాళన పూజలు చేయనున్నారు.

ఎయిర్‌పోర్ట్‌కు రానివ్వకుండా అడ్డంకులు

రేణిగుంట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం నుంచే అధిక సంఖ్యలో పోలీసు బలగాలు మోహరించాయి. కార్యకర్తలు, నాయకులెవ్వరూ ఎయిర్‌పోర్ట్‌కు రానివ్వకుండా అడ్డుకున్నారు. పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందని, తెల్లవారుజాము నుంచే వైఎస్సార్ సీపీ ప్రధాన నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని నిద్ర లేపి మరీ నోటీసులు ఇచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎయిర్‌పోర్ట్ బయట అధికారులు ప్రత్యేక కాన్వాయ్ వాహన శ్రేణిని ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందికి సూచనలిస్తూ ఏ ఒక్కరినీ ఎయిర్‌పోర్ట్ వద్దకు రాకుండా నిలువరించాలని సూచించారు. దీంతో రేణిగుంట నుంచి ఎయిర్‌పోర్ట్ మార్గంలో అడుగడుగునా పోలీసు బలగాలను ఏర్పాటు చేసి అటు వైపు వెళ్లే వాహనాలను ఆపి తిప్పి పంపారు. ఎయిర్ పోర్ట్ టెర్మినల్ బయట సుమారు వంద మంది వరకు పోలీసు బలగాలను ఉంచి గతంలో ఎప్పుడూ లేని రీతిలో బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే మాజీ సీఎం పర్యటన రద్దు కావడంతో కాన్వాయ్ వాహన శ్రేణిని తిప్పి పంపారు.



ఎయిర్‌పోర్టు బయట కాన్వాయ్

ప్రధాన ఆకర్షణగా స్వాగత బ్యానర్లు

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఎయిర్‌పోర్ట్ నుంచి రేణిగుంట వరకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి స్వాగత బ్యానర్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఆయనకు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేశారు.




ఏర్పేడు: జమల్ల శ్రీనివాసులు, శివయ్య



విద్యానాథరెడ్డి



అంజూరు శ్రీనివాసులు

స్వామీ.. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ వేంకటేశ్వర స్వామి మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని లడ్డూ పవిత్రతను ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి రాజకీయ దుర్బుద్ధితో దిగజార్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. అసత్య ప్రచారాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అపవాదులు వేయడం దారుణమని మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయాలని ఆయన వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తమ నియోజకవర్గాల్లో ఉన్న ఆలయాల్లో జరిగే పూజల్లో పార్టీ శ్రేణులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దాడులకు పాల్పడితే మూల్యం తప్పదు

- మాజీ మంత్రి కాకాణి హెచ్చరిక

కలువాయి: అధికారం ఉందని టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, అందుకు రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి హెచ్చరించారు. కలువాయి మండలం, దాచూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ మండల మాజీ కన్వీనర్, సీనియర్ నాయకుడు దుంపా రామచంద్రారెడ్డిని శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. అధికారం అండ చూసుకుని చెలరేగిపోతున్న వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్న ఎవర్నీ భవిష్యత్‌లో వదిలే ప్రసక్తే లేదన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు జెడ్పీటీసీ సభ్యులు బీ.అనిల్‌కుమార్ రెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.



దుంపా రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తిరుపతి రైల్వే స్టేషన్‌కు బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ అవార్డు

తిరుపతి(అలిపిరి): తిరుపతి రైల్వే స్టేషన్ బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ అవార్డు సొంతం చేసుకుంది. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో వార్షిక టూరిజం ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ రైల్వే స్టేషన్‌కు బెస్ట్ టూరిస్ట్ ఫ్రెండ్లీ అవార్డును అందుకున్నారు.



సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.22.51 లక్షలు


వెంకటగిరి రూరల్/సైదాపురం: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి హుండీ ఆదాయం రూ.22,51,975 వచ్చినట్టు ఈఓ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఏడు రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించినట్టు వెల్లడించారు. ఇందులో రూ.20,08,028 నగదు, బంగారు పాదముల హుండీ ద్వారా రూ.2,43,947 మొత్తం రూ.22,51,975, ప్రధాన ఆలయ హుండీ ద్వారా 7.2 మి.గ్రా బంగారు, 98.5 గ్రాములు వెండి, పాదములు హుండీ ద్వారా 12.563 గ్రాముల బంగారు కానుకలు వచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా యూఎస్ డాలర్లు 21, కువైట్ దినార్ 1 చొప్పున వచ్చాయన్నారు.

ప్రకృతి వ్యవసాయం భేష్

భాకరాపేట: ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులు ముందుకు రావడం శుభప్రదమని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం టీ.చట్టేవారిపాళెం పంచాయతీలో మహిళా రైతు సరస్వతి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ చేపట్టిన పంటల తోటలను మాలి దేశ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా మాలి దేశ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు చాలా బాగున్నాయని కితాబిచ్చారు. ఎగ్ యమినో యాసిడ్ తయారు చేయడం బాగుందన్నారు.

నేడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాక

- రేపు జాయింట్ పార్లమెంటరీ కమిటీ
- అక్టోబర్ 1 నుంచి 8 వరకు నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డా.ధనంజయ వై.చంద్రచూడ్ శనివారం విచ్చేయనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జేసీ శుభం బన్సల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. శని, ఆది వారాలు జిల్లాలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉంటారని తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారన్నారు. మరుసటి రోజు ఆదివారం ఉదయం 8.15 గంటలకు తిరుమల చేరుకొని, శ్రీవారిని దర్శించుకుంటారని తెలిపారు. తర్వాత మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమవుతారని పేర్కొన్నారు. అలాగే ఆదివారం జాయింట్ పార్లమెంటరీ కమిటీ పర్యటించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 1 నుంచి 8వ తేదీ వరకు జిల్లాలో ఎనిమిది రోజులపాటు నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం పర్యటిస్తుందని వెల్లడించారు. వారికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్, ప్రోటోకాల్ అధికారి చంద్రశేఖర్‌నాయుడు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఆదిశేషారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, పీడీ డ్వామా శ్రీనివాస ప్రసాద్, డీఆర్డీఏ పీడీ ప్రభావతి, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలదేవి పాల్గొన్నారు.

రేపు ఏపీ బాలల హక్కుల చైర్మన్ రాక

ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసాలి అప్పారావు ఆదివారం జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు తిరుపతికి చేరుకుని రోడ్డు మార్గంలో తిరుమలకు వెళ్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు అక్కడి నుంచి తిరుగుప్రయాణం కానున్నట్టు ఆయన వెల్లడించారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.77,880
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.7,069

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.93,500
రిటైల్ వెండి గ్రాము	రూ.96.50

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: తిరుపతిలో అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి మూడు రోజులు జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి, ఎంఆర్ పల్లి, శాంతి నగర్‌కి చెందిన ఆటో డ్రైవర్ పి.కుమార్, తిరుపతి పీకే లేఅవుట్‌కి చెందిన ఆటో డ్రైవర్ ఆరు బాలాజీ నాయక్‌లు అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా ట్రాఫిక్ పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఇద్దరికీ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రెండేళ్ల క్రితం అలిపిరి వద్ద విద్యుత్ బస్సులను ప్రారంభిస్తున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి , విద్యుత్ బస్సులు





విద్యుత్ బస్సులు.. కూటమి బ్రేకులు!

పర్యావరణ పరిరక్షణ.. ప్రయాణికుల సంరక్షణే లక్ష్యంగా గత ప్రభుత్వం అడుగులు వేసింది. ఇందులో భాగంగా రెండేళ్ల క్రితం జిల్లాలో విద్యుత్ బస్సుల వినియోగానికి శ్రీకారం చుట్టింది. బస్సుల సంఖ్యను అంచెలంచెలుగా పెంచుతూ.. ఆదాయ మార్గాలను అన్వేషించింది. కానీ కూటమి సర్కార్ కొలువుదీరిన తర్వాత విద్యుత్ బస్సుల నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. కొత్త సర్వీసులకు ప్రతిపాదనలు లేక.. కొత్త చార్జింగ్ పాయింట్లు చూపక అగచాట్లు పడాల్సి వస్తోంది. ఫలితంగా రాబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. దీనిపై సంబంధిత ఆర్టీసీ అధికారులు సైతం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- 2022 సెప్టెంబర్27న ప్రారంభించిన అప్పటి సీఎం వైఎస్ జగన్
- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా అడుగులు
- రెండేళ్లలో రూ.77.58 కోట్ల రాబడి
- గత నాలుగు నెలలుగా తగ్గుతున్న ఆదాయం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

■ 2022 సెప్టెంబర్ 27 (50 సర్వీసులు) నుంచి 2023 మార్చి 31 వరకు	: రూ.7.4 కోట్లు
■ 2023 ఏప్రిల్ 1 నుంచి (100 సర్వీసులు) 2024 మార్చి 31 వరకు	: రూ.56.02 కోట్లు
■ 2024 ఏప్రిల్ 1 నుంచి(100 సర్వీసులు) 2024 సెప్టెంబర్ 27 వరకు	: రూ.14.16 కోట్లు

తిరుపతి అర్బన్: తిరుపతి–తిరుమల మార్గంలో పర్యావరణ పరిరక్షణతోపాటు భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ బస్సులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా 2022 సెప్టెంబర్ 27వ తేదీన అలిపిరి వద్ద వంద విద్యుత్ బస్సులను ప్రారంభించారు. ఇందులో 50 సర్వీసులను తిరుపతి నుంచి తిరుమలకు తిప్పుతున్నారు. మరో 14 సర్వీసులను రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు, ఇంకో 12 సర్వీసులను తిరుపతి నుంచి మదనపల్లికి, మరో 12 సర్వీసులను తిరుపతి నుంచి కడపకు, ఇంకా 12 సర్వీసులను తిరుపతి నుంచి నెల్లూరుకు ఏర్పాటు చేశారు. విద్యుత్ సర్వీసుల్లో సకల వసతులు ఉండడంతో ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అలిపిరి డిపో ఆధారంగా మరో 250 విద్యుత్ సర్వీసులను ఏర్పాటు చేయాలని అప్పట్లోనే నిర్ణయించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేశారు. గత సర్కారు ఏర్పాటు చేసిన సర్వీసులనే ఉడతాభక్తిగా తిప్పుతున్నారు.

కొత్త సర్వీసుల ప్రతిపాదనలేవీ?

టీడీపీ కూటమి సర్కార్ ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా విద్యుత్ బస్సుల నిర్వహణ, ఆదాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కొత్త సర్వీసుల ప్రతిపాదనలుగానీ, కొత్త విద్యుత్ సర్వీసులుగానీ ఏర్పాటు చేయకపోవడం ప్రయాణికులను బాధిస్తోంది.

తగ్గుతున్న రాబడి

కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత విద్యుత్ సర్వీసుల నిర్వహణ గాలికొదిలేయడంతో రాబడి క్రమేణా తగ్గుతోంది. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి విద్యుత్ సర్వీసుల రాబడి తగ్గిపోయింది. గత ఏడాది 12 నెలలకు రూ.56.02 కోట్ల రాబడి రాగా.. ఈ ఏడాది 6 నెలలకుగాను రూ.14.16 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే ఈ ఏడాది రూ.14 కోట్ల రాబడి తగ్గినట్టు ఆర్టీసీ అధికారులు చర్చించుకుంటున్నారు.

రెండేళ్లలో రూ.77.58 కోట్ల రాబడి

గత రెండేళ్లలో విద్యుత్ సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.77.58 కోట్లు సమకూరింది. తిరుమల ఘాట్ రోడ్డు రాబడిలో 59 శాతం విద్యుత్ సర్వీసుల యాజమానానికి, 41 శాతం ఆర్టీసీకి వర్తిస్తోంది. సాధారణ మార్గంలో 46 శాతం విద్యుత్ యాజమాన్యానికి, 54 శాతం ఆర్టీసికి రాబడి సమకూరుతోంది. గత ప్రభుత్వంలో విద్యుత్ బస్సులకు అలిపిరి డిపోలో 46 చార్జింగ్ పాయింట్లు, తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో 11, తిరుపతి గ్యారెజ్‌లో 4 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు.

ఇబ్బందుల్లేకుండా నడుపుతున్నాం



ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సర్వీసులను నడుపుతున్నాం. అలిపిరి డిపో కేంద్రంగానే 100 విద్యుత్ బస్సులు నడుస్తున్నాయి. జీతాల విషయంలో అప్పుడప్పుడూ విద్యుత్ సర్వీసుల డ్రైవర్లు నిరసనలు చేపడుతున్నా.. ఆ సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వంద విద్యుత్ బస్సులు రన్నింగ్‌లో ఉన్నాయి. రాబడికి తగ్గకుండా చర్యలు చేపడుతున్నాం. –సింగం హరిబాబు, ఆర్టీసీ అలిపిరి డిపో మేనేజర్

రేషన్ కమీషన్లకు అధికారుల మోకాలడ్డు

- 2024 నుంచి రూ.8.5 కోట్ల బకాయిలు పెండింగ్
- లబోదిబోమంటున్న డీలర్లు

తిరుపతి అర్బన్: రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్లకు సంబంధిత అధికారులు మోకాలడ్డుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 2014 నుంచి 2024 వరకు మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసిన రేషన్‌కు సంబంధించిన కమీషన్ బకాయిలు రూ.8.5 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. దాని కోసం పదేళ్లుగా డీలర్లు ఎదురుచూస్తున్నారు. తక్షణం బకాయిలు చెల్లించాలని రెండు నెలల క్రితం సంబంధిత ఉన్నతాధికారులు ఆదేశించినా స్థానిక అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. జిల్లాలో 1,457 రేషన్ షాపుల్లో 1,434 మంది డీలర్లు పనిచేస్తుండగా.. ఇందులో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్‌సీపీ ముద్ర వేసి 25 శాతం మంది డీలర్లను తొలగించారు. మిగిలిన వారికీ సంబంధిత బకాయిలు విడుదల చేయలేదు. దీనిపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజారఘువీర్‌ని ప్రశ్నించగా.. జిల్లాలోని 34 మండలాల పరిధిలో ప్రభుత్వ రేషన్ డీలర్ ఎప్పటి నుంచి పనిచేస్తున్నారు.. 2014 –2024 వరకు ఎంత కాలం పనిచేశారు.. పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం ఎన్ని క్వింటాళ్లు సరఫరా చేశారు.. ఆ డీలర్‌కు ఎంత కమీషన్ రావా లి.. అనే వివరాలు సంబంధిత తహసీల్దార్లు ఇవ్వా ల్సి ఉందన్నారు. వారి వివరాల కోసం వేచి చూస్తు న్నట్టు తెలిపారు. దీనిపై జిల్లా సివిల్ సప్లయ్ మేనే జర్ వై.సుమతి మాట్లాడుతూ డీఎఫ్‌ఓ నుంచి సమాచారం వస్తే కమీషన్ బకాయిలు విడుదల చేస్తామన్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎంటెక్ 3వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఆన్‌లైన్ చెస్ పోటీల్లో ప్రతిభ



ఆన్‌లైన్ చెస్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన ప్రభుత్వ పరిశీలన గృహం బాలురు

తిరుపతి మంగళం : ఆన్‌లైన్ చెస్ పోటీలలో మంగళంలోని ప్రభుత్వ పరిశీలన గృహం, ప్రత్యేక గృహాలలో ఉన్న బాలురు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. నయి దిశా సామాజిక కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ చెస్ పోటీలలో తిరుపతి ప్రభుత్వ పరిశీలన గృహం బాలురు రన్నరప్‌గా నిలిచినట్టు పర్యవేక్షణ అధికారులు షణ్ముఖరావు, త్రినాథ్‌రావు, శరత్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మంగళం పరిధిలోని ప్రభుత్వ పరిశీలన గృహంలో ఆన్‌లైన్ ద్వారా జరిపే ఈ చెస్ పోటీలను ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆర్బిటర్ మల్లికార్జున్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నుంచి తిమ్మప్ప పర్యవేక్షించారు. ఆన్‌లైన్ చెస్ పోటీలలో ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం టీమ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రన్నరప్‌గా నిలిచినట్టు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలుర టీమ్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. రీజనల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రొబేషన్ అధికారి లక్ష్మీపతి, ఉప పర్యవేక్షణ అధికారి శ్రీధర్, మోహన్ పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి పెద్దపీట



హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న జేసీ శుభం బన్సల్

చంద్రగిరి: జిల్లాలో పర్యాటకరంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ప్రపంచ పర్యాటకదినాన్ని పురస్కరించుకుని చంద్రగిరి క్లాక్ టవర్ సెంటర్ నుంచి చంద్రగిరి కోట వరకు విద్యార్థులతో కలిసి హెరిటేజ్ వాక్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. తర్వాత సుమారు రూ.3.5కోట్లతో ఏర్పాటు చేసిన చంద్రగిరి సౌండ్ అండ్ లైట్స్ షోను ప్రారంభించారు. భారత ఆర్కియాలజీ విభాగం, ఏపీటీడీసీతో కలిసి పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో లక్స్, డెసిబిల్స్ సంస్థ చంద్రగిరి చరిత్రను తెలుపుతూ ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్స్ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. త్వరలోనే ఫుడ్ కోర్టు, బోటింగ్ ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ డీవీఎం గిరిధర్‌రెడ్డి, ఈఈ సుబ్రమణ్యం, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, కోట సీఏ ప్రవీణ్‌కుమార్, లక్స్ అండ్ డిసిబుల్స్ ప్రతినిధి శివ, ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి, ఎంపీటీసీ బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, సర్పంచ్ ముదికుప్పం రూపరామ్మూర్తి పాల్గొన్నారు.

పిల్లల్లో భాషా సామర్థ్యాలను వెలికితీయాలి



బాలకథానిధి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ వీ.శేఖర్, ఇతర అధికారులు

తిరుపతి కల్చరల్: పిల్లల్లోని భాషా సామర్థ్యాలను వెలికి తీసి సృజనాత్మకంగా ఆలోచించేలా చేయడంతోపాటు వ్యక్తిత్వ వికాసానికి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వీ.శేఖర్ పిలుపునిచ్చారు. మంగళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలకథానిధి పుస్తకావిష్కరణ, అష్టావధానం నిర్వహించారు. ఇందులో డీఈవో ముఖ్య అతిథిగా పాల్గొని తిరుపతి జిల్లా పరిధిలో పిల్లలు రాసిన బాలసాహిత్య కథల పుస్తకం బాలకథానిధిని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలను భాషావేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు. సాహితీవేత్త సాకం నాగరాజు మాట్లాడుతూ నేటి పిల్లలకు పఠనంపై ఆసక్తి పెంచేలా కథల పుస్తకాలు చదివించాలని తెలిపారు. అనంతరం హర్ష అవధానం చేశారు. దీనికి శతావధాని ఆముదాల మురళి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఇందులో నిషిద్ధాక్షరిపై గోవిందయ్య, సమస్యపై మన్నవ గంగాధరప్రసాద్, దత్తపదిపై రాధామదన, వర్ణనపై యువశ్రీ మురళి, పురాణ పఠనంపై ఆమూరి సుబ్రమణ్యం, వ్యవస్తాక్షరిపై డాక్టర్ నెమిలేటి కిట్టన్న, ఆశువుపై డాక్టర్ దుర్గ, అప్రస్తుత ప్రసంగంపై వెంకటరమణ అడిగిన ప్రశ్నలకు అవధాని హర్ష అద్భుత రీతిలో పద్యరూపంలో సమాధానాలు ఇచ్చి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డీవైఈవో బాలాజీ, ఎంఈవో భాస్కర్ నాయక్, హెచ్‌ఎం కేశవులు నాయుడు, తెలుగు ఉపాధ్యాయులు లక్ష్మీకాంతమ్మ, మాధవి, రాధా మదన, శైలజారాణి, విజయలక్ష్మి, మునిరత్నం, వెంకటేష్, శ్రీధర్, వెంకటరమణ, నీరజ, కవిత, గోపి, గిరీశం, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు ఎస్.భాను, జి.సుశీల పాల్గొన్నారు.

ఇద్దరికి రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్: తిరుపతి రూరల్ పరిధిలో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లిన ఇద్దరికి రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి రూరల్, పెరుమాళ్లపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పి.ఆదిశేకర అలియాస్ లక్కీ ఆది, తిరుపతి రూరల్, పెరుమాళ్లపల్లి పంచాయతీ, లక్ష్మీ చెరువుకు చెందిన కె.మణికంఠ 2021 జూలై 31వ తేదీ రాత్రి తిరుపతి రూరల్ వెంకటాద్రి అపార్ట్‌మెంట్ వద్ద ఉంచిన ద్విచక్ర వాహనాన్ని అపహరించారు. వాహన యజమాని సూరిబాబు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దర్నీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అలాగే తిరుపతి రూరల్ ప్రాంతంలో మరో ద్విచక్ర వాహనాన్ని అపహరించిన కేసులో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను విచారించిన న్యాయమూర్తి ఇద్దరికీ రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

స్విమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీలు

తిరుపతి తుడా: స్విమ్స్ ఆస్పత్రి కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం పలు రకాల మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఇందులో ప్రధానంగా పురుషులకు సంబంధించిన మాస్టర్ హెల్త్ చెకప్ కోసం రూ.5,900, స్త్రీలకు సంబంధించిన మాస్టర్ హెల్త్ చెకప్ కోసం రూ.6,500, మహిళలు, పురుషులకు సంబంధించిన కార్డియాలజీ క్లినిక్ కోసం రూ.2,100 చెల్లించాలని సూచించారు. రోగులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు ఆస్పత్రిలో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజును ఫోన్ నంబర్ 94412398362లో సంప్రదించాలని వెల్లడించారు.

ఇరువర్గాల ఘర్షణ

తడ: పొలం విషయంలో ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం.. మండలంలోని పెరియవట్టు గ్రామానికి చెందిన సయ్యద్ ఇబ్రహీం కాలేషాకి అదే గ్రామంలో 15 ఎకరాల పొలం ఉంది. ఇటీవల చెన్నైకి చెందిన సయ్యద్ ఇబ్రహీం అనే వ్యక్తి ఆ పొలంపై తనకు హక్కు ఉన్నట్టు వాదనలకు దిగాడు. దీనిపై కోర్టుకు కూడా వెళ్లడంతో అక్కడ అతనికి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం ఇరువర్గాలు తడ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకోవడంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శరత్ ఆ భూమికి సంబంధించి అన్ని హక్కులు పెరియవట్టు ఇబ్రహీంకి ఉన్నట్టు తేల్చారు. ఈ క్రమంలో ఇరువర్గాలు కార్యాయం నుంచి బయటకు వచ్చేశాయి. ఇంతలో చెన్నైకి చెందిన ఇబ్రహీం కుటుంబ సభ్యులు పెరియవట్టుకు చెందిన ఇబ్రహీం కాలేషా, అతని తమ్ముడు నజీర్‌తోపాటు మరో మహిళపై దాడికి దిగారు. కారు అద్దాలు పగుల గొట్టారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పారిపోతున్న చెన్నై వాసులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో చేపల మృత్యువాత



నిండలి కైవల్యనదిలో మృతి చెందిన చేపలు

బాలాయపల్లి(సైదాపురం): కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. చేపలు పట్టుకునే క్రమంలో నిబంధనలను అతిక్రమిస్తున్నారు. ఇలాంటి ఘటనే బాలాయపల్లి మండలం, నిడలి గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు యువకులు విద్యుత్ వైర్ల నుంచి అక్రమంగా కనెక్షన్లు తీసుకుని కైవల్య నదిలో వేస్తున్నారు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై చేపలు మృతిచెందుతున్నాయి. ఇవి రోజుల తరబడి నీళ్లలో కుళ్లి పోతుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. నీరు సైతం కలుషితమవుతోంది. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోషన్‌శ్రీవాత్సవకు ప్రతిష్టాత్మక అవార్డు



రోషన్‌శ్రీవాత్సవకు అవార్డు అందజేస్తున్న ఐఐటీ డైరెక్టర్ కేఎస్.సత్యనారాయణ

ఏర్పేడు: మండలంలోని ఐఐటీ తిరుపతి నవ ఆవిష్కర్, టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రోషన్‌శ్రీవాత్సవకు జాతీయ జియోస్పేషియల్ ఫ్యాకల్టీ ఫెలో అవార్డు దక్కినట్లు డైరెక్టర్ కేఎస్.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. భౌగోళిక శాస్త్రాలు, సాంకేతిక రంగంలో అనేక సాంకేతిక అభివృద్ధి, స్టార్టప్స్ ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధి కార్యకలాపాల ద్వారా ఐఐటీటీఎస్‌ఐఎఫ్ చేసిన అసాధారణమైన కృషి, వ్యాపార వేత్తలను ప్రోత్సహించడంలో గణనీయమైన పాత్ర పోషించినట్లు వివరించారు. అలాగే స్పేషియల్ లెన్స్, వికాస్ లాంటి వినూత్న కార్యక్రమాలు ప్రారంభించి సమాజంలోని అనేక రంగాలకు విలువైన మద్దతును అందించడం పట్ల ఐఐటీ బాంబే, ఫోస్సీ, నేషనల్ మిషన్ ఆన్ ఎడ్యుకేషన్ త్రో ఐసీటీ(ఎన్‌ఎంఈఐసీటీ), విద్యా మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో రోషన్ శ్రీవాత్సవకు అవార్డు అందజేసినట్లు చెప్పారు. ఈ మేరకు ఐఐటీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

వార్తలు రాస్తే నరుకుతాం!

- చిన్నగొట్టిగల్లు మండలంలో బరితెగిస్తున్న కూటమి నేతలు
- భూ ఆక్రమణల వార్తలు రాయడంపై రాద్ధాంతం
- అక్రమ కేసులు బనాయిస్తున్న వైనం



తిప్పిరెడ్డిగారిపల్లెలో కూటమి నేతల ఆక్రమణలో ప్రభుత్వ భూమి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో కూటమి నేతల రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. దీన్ని ప్రశ్నించిన వారిపై అధికార బలంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారు. వార్తలు రాసినా సంబంధిత విలేకరులను చంపేస్తామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక అధికారులు ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రశ్నిస్తే దాడులే!

దేవరకొండ పంచాయతీలో జరుగుతున్న భూ ఆక్రమణలపై వార్తలు రాసిన ఓ రిపోర్టర్ ఇంటిపై గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన భూ ఆక్రమణదారులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కారు, ద్విచక్ర వాహనాన్ని ధ్వంసమైంది. ఆమె భర్తపై కూడా దాడికి తెగబడ్డారు. ఈ మేరకు ఆ రిపోర్టర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తిప్పిరెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నం .1727లో భూ ఆక్రమణలపై ఓ రిపోర్టర్ తహసీల్దార్‌ను వివరణ కోరడం తెలుసుకున్న కూటమి నేతలు ఇద్దరు రిపోర్టర్లపై అక్రమ కేసులు బనాయించారు. ఇదేమని భాకరాపేట ఎస్‌ఐని వివరణ కోరగా తమ విచారణలో దాడులకు పాల్పడినట్లు తేలిందని, అందుకే కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భూ ఆక్రమణలపై తహసీల్దార్‌ను వివరణ కోరినందుకు ఇంకో రిపోర్టర్‌పై అక్రమ కేసు నమోదు చేయడంతో పాటు చంపేస్తామని బెదిరింపులకు దిగారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని సదరు రిపోర్టర్ వాపోతున్నారు. భూ ఆక్రమణలను వెలుగులోకి తెచ్చినందుకే మల్లెలవాండ్లపల్లెలో ఓ రిపోర్టర్‌పై దాడికి దిగినట్టు స్పష్టమవుతోంది. సంబంధిత అధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించాలని పలువురు రిపోర్టర్లు కోరుతున్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్ బౌన్స్ కేసులో విజయపురం మండలం, కేవీపురానికి చెందిన కేకే బాబునాయుడుకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. బాబు నాయుడు తన అవసరాల కోసం 2017 ఆగస్టు 31వ తేదీన తిరుపతి ఆర్సీ రోడ్డుకు చెందిన ఏ.దొరస్వామి నాయుడు వద్ద రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సొమ్మును చెల్లించే క్రమంలో అతను 2018 ఫిబ్రవరి 7వ తేదీన రూ.2లక్షల చెక్కును దొరస్వామి నాయుడుకు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యింది. దీంతో దొరస్వామి నాయుడు అతనిపై కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి బాబు నాయుడుకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.